PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 184 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 01 జులై 2025

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు



2లో

## స్వేచ్ఛ ఆత్మహత్యలో పూర్ణ ప్రమేయం లేదు



2లో







# పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- మంటలు చెలరేగి పదిమంది దుర్మరణం
- వెంటనే సహాయక చర్యలకు దిగిన అధికారులు
- వివిధ ఆస్పత్రుల్లో క్షతగాత్రులకు చికిత్స

**సంగారెడ్డి,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సీగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమ తునాతునకలైపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9 గంటల సమయంలో సీగాచి కెమికల్స్‌లో పని సాగుతున్న సమయంలో రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి కంపెనీ షెడ్డు పూర్తిగా కూలిపోయింది. మంటలు తక్కువ సమయంలోనే పరిశ్రమ మొత్తం వ్యాపించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. అయినప్పటికీ, పలువురు కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు కార్మికులు మంటల్లో సజీవదహనమయ్యారు. మిగతా మృతుల మరణానికి తీవ్ర గాయాలు కారణమయ్యాయని తెలుస్తోంది. శిథిలాల కింద ఇంకా 15 మంది కార్మికులు చిక్కుకుపోయి మిగతావి 2లో

# పాశమైలారం ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

● క్షతగాత్రులకు మెరుగైన వైద్యానికి ఆదేశం



**హైదరాబాద్,30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో పేలుడు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన వెంటనే వివరాలు ఆరా తీసారు. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడి పలువురు మిగతావి 2లో

# విధేయత..సీనియారిటికే ప్రాధాన్యం

● తెలంగాణ బిజెపి సారథిగా రామచంద్రరావు ● అందరినీ కలుపుకుని పోతానని వెల్లడి
● ప్రత్యక్ష ఎన్నికే మేలంటున్న రాజాసింగ్



**హైదరాబాద్,30 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరు ఖరారైంది. ఈ మేరకు నామినేషన్ వేయాలని పార్టీ అధిష్ఠానం ఆయన్ను ఆదేశించింది. మధ్యాహ్నం 2 గంటలకు రామచందర్‌రావు నామినేషన్ దాఖలు చేసారు. రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతలు తీవ్ర కసరత్తు చేశారు. మిగతావి 2లో

# అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

☛నక్సల్స్‌లో చర్చలు జరపాలంటే ప్రోత్సహించినట్లా..?
☛అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్



**హైదరాబాద్,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్ట్‌ల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్ట్‌ల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసిది' అంటూ్గ ÷ర్ అయ్యారు.శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ మిగతావి 2లో




# నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీల అమలు

- తత్కాల్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరి

**న్యూఢిల్లీ,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్‌బుకింగ్‌లో నిబంధనల అమలుపై రైల్వేబోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని తెలిపింది. జూలై 1నుంచి ఈ మార్పులు అమలు కానున్నాయని ఇప్పటికే ప్రకటించింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసిన రైల్వేశాఖ.. మిగతావి 2లో

# బనకచర్లకు అనుమతులు ఇవ్వలేం

☛పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించండి
☛ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు ఉన్నాయి
☛కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం



**న్యూఢిల్లీ,30(పిసిడబ్ల్యూ న్యూస్):** పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రెబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదిం చడం అత్యవసరమని కమిటీ అభిప్రాయపడింది. బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను నిపుణుల కమిటీ పరిశీలిం చింది. అయితే, 1983లో గోదావరి ట్రెబ్యునల్ ఇచ్చిన మిగతావి 2లో

# కర్ణాటకలో సిఎం మార్పు వ్యవహారం

- అంతా అదిష్టానం చేతిలో ఉందన్న ఖర్గే



**బెంగళూరు, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు జరగనుందని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు కట్టబెట్టబోతున్నారని చర్చ మిగతావి 2లో

# ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం

☛క్షతగాత్రులకు హరీష్ రావు పరామర్శ
☛మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్




**హైదరాబాద్,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరిశ్రమల భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోనే పాశమైలారం ప్రమాదం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. పాశమైలారం పరిశ్రమ పేలుడు ఘటనపై మాజీ మంత్రి, హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. నేపాశమైలారం

మిగతావి 2లో

# బిసిలంటేనే కాంగ్రెస్ పార్టీ

☛సిఎం రెడ్డి అయితే..అధ్యక్షుడు బిసి ☛బిజెపి బిసిలను వంచించిందన్న పొన్నం



**హైదరాబాద్,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీజేపీ పార్టీ బీసీల వ్యతిరేకని మరోసారి నిరూపించుకుందని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముగ్గురు బీసీ ఎంపీలు ఉన్నా.. అలాగే అనేకమంది బీసీ సీనియర్ నేతలు ఉన్నా సరే.., అలాగే బీజేపీ అధ్యక్షుడు కావడానికి అన్ని అర్హతలు ఉన్నవారికి అధ్యక్ష పదవి ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో బీసీ ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి కనీసం సభాపక్ష నాయకుడుని కూడా బీసీలకు ఇవ్వలేదని ఆగ్రహించారు. తాజాగా మంత్రి బీసీల విషయమై స్పందిస్తూ.. బీసీల గురించి చర్చను లేవనెత్తారు. అంతే కాకుండా ఆయన బీజేపీ ఓ ఫ్యూడల్ పార్టీ అన్నారు. బీజేపీలో బీసీలకు ఎప్పుడూ న్యాయం జరగలేదు. బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వెయ్యనివ్వకుండా అడ్డుకొని నిరంకుశత్వంగా వ్యవహరించారని అన్నారు. బీజేపీలో బీసీలకు అన్యాయం జరుగుతుందని

మిగతావి 2లో

# పాశమైలారం ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో పదిమిది మంది కార్మికులు మృతి చెందారు. ఘటనాస్థలంలో ఐదుగురు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. దీంతో క్షతగాత్రులకు సత్వర వైద్యం అందించాలని సిఎం ఆదేశించారు.

# అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

(మొదటి పేజీ తరువాయి)

రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ÷ర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎ ల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారం కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

# నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీల అమలు

(మొదటి పేజీ తరువాయి)

జులై 1 నుంచి అమలులోకి తీసుకుని రావాలంటూ అన్ని జోన్‌ల మేనేజర్లకు సర్క్యులర్ జారీ చేసింది. దీంతో అర్ధరాత్రి 12గంటల నుంచి పెంచిన రైల్వే ఛార్జీలు అమలులోకి రానున్నాయి. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 500కి.మీ వరకు సాధారణ ఛార్జీలే ఉండనున్నాయి. 501 కి.మీ నుంచి 1500 కి.మీ వరకు టికెట్‌పై రూ.5; 201 కి.మీ నుంచి 2500 కి.మీ వరకు టికెట్‌పై రూ.10; 2501 నుంచి 3వేల కి.మీ వరకు టికెట్‌పై రూ.15 చొప్పున పెంచారు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్లపై కి.మీకు అరపైసా చొప్పున పెంచగా.. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్ ఏసీ) రైళ్లలో టికెట్లపై నాన్ ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ టికెట్లపై కి.మీకు ఒక పైసా చొప్పున పెంచారు. అలాగే, అన్ని రకాల రైళ్లలో ఏసీ అన్ని తరగతులకు కి.మీకు 2పైసలు చొప్పున పెంచుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. రిజర్వేషన్ ఛార్జ్, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీల్లో మాత్రం మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసిన టికెట్లకు పెంచిన ఛార్జీలు అమలు కావని తెలిపింది.

# కర్ణాటకలో సిఎం మార్పు వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. రాజధాని బెంగళూరులో మీడియా ఈ అంశంపై ప్రశ్నించడంతో ఆయన సమాధానం చెప్పారు. ముఖ్యమంత్రి మార్పు అంశం పార్టీ హైకమాండ్ చేతిలో ఉందని, పార్టీ హైకమాండ్‌లో ఏం జరుగుతుందనే విషయాన్ని ఏ ఒక్కరూ బయటికి చెప్పరని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. చర్య తీసుకునే హక్కు హైకమాండ్‌కు మాత్రమే ఉందని, కాబట్టి విషయాన్ని హైకమాండ్‌కే వదిలేద్దామని చెప్పారు. దీనిపై ఎవరూ అనవసరమైన సమస్యలు సృష్టించవద్దని ఆయన కోరారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు వార్తలు నిజమేనా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఖర్గే పైవిధంగా స్పందించారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం అదే విషయం చెప్పడంచర్చనీయాంశంగా మారింది. మరో రెండుమూడు నెలల్లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని హుస్సేన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం హైకమాండ్ శివకుమార్ గురించే యోచిస్తోందని అన్నారు. డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుంది.

# మల్లక్కపేట గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య

**పరకాల, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మండలం లోని మల్లక్క పేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీ వాణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విద్యార్థిని శ్రీవాణి పరకాల వాసిగా తెలుస్తోం ది. ఆత్మహత్యపై పోలీసులు విచారిస్తున్నారు. అసలు గురుకు లంలో ఏం జరుగుతుంది? గతంలో కొండచిలువలు గురుకు లంలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే.. పదేపదే గురుకులం ఏదో ఒక సంఘటనలకు కేంద్ర బిందువుగా మారు తుంది.. తక్షణమే అధికారులు స్పందించి అసలు గురుకులంలో ఏం జరుగు తుం ది? యజమాన్యం సరిగ్గా బాధ్యత తీసుకుం టుందా? ప్రత్యేక నిఘ పెట్టి ఇలాంటి పునరావితం కాకుండా చూసుకో వాలని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘ టనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ఉండొచ్చని అనుమానించడంవల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. గాయపడ్డ 38 మందిలో 20 మందిని చందానగర్ ప్రభుత్వాస్పత్రికి, మరో 18 మందిని ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే 8 ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు భారీ క్రేన్‌లు, హైడ్రా మిషన్‌లను రంగంలోకి దించారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పూర్తిగా కూలిపోవడంతో సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రాణాపాయంగా శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ భవనం నుంచి కేవలం ఆరుగురినే బయటకు తీయగలిగారు. కెమికల్ ఫ్యాక్టరీలో మంటలతో పాటు భారీగా విషవాయువులు విడుదలవడంతో పరిసర ప్రాంతాల్లో ఘాటైన వాసనలు వ్యాపించాయి. స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతూ తమ ఇళ్లలోకి చెదురుమదురుగా చేరుకున్నారు. అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి ఎవరూ రావొద్దని హెచ్చరించారు. ఈ పేలుడు ఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాం÷-రతికి గురిచేసింది. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్నదానిపై విచారణ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు తర్వాత అసలు ప్రమాద స్థాయి ఎంత పెద్దదో అర్థం కానుంది. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగి పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ప్రమాదంతో స్థానికులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారిని అక్కడి నుంచి దూరంగా పంపించివేసారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సంఘటన స్థలానికి పఠాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మల్టీజోన్ టు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్ చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# విధేయత..సీనియారిటీకే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేర్లు బలంగా వినిపించాయి. ఈ క్రమంలో రామచందర్‌రావు పేరును ఖరారు చేశారు. ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు ఆయన పేరును బలంగా ప్రతిపాదించినట్లు తెలిసింది. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇకపోతే గత 40 ఏళ్లుగా పార్టీలో రామచంద్రరావు వివిధ హోదాల్లో పనిచేశారు. విద్యార్థి పరిషత్ నాయకుడిగా, లాయర్‌గా సేవలు అందించారు. ముందునుంచి పార్టీలో ఉంటూ సేవ చేసిన కారణంగా ఆయనను అధ్యక్ష పదవి వరించింది. అంతా కలిసికట్టుగా ముందుకెళ్తాం అని బిజెపి మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు తెలిపారు. బిజెపి పార్టీలో ఆధిపత్య పోరు లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివాద రహితుడుగా అవకాశం ఇచ్చిందని, 40 ఏళ్లుగా పార్టీకి చేస్తున్న సేవను అధిష్టానం గుర్తించిందని తెలియజేశారు. ఇప్పటికే ఆశావాహుల్లో అనేక మంది పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరును జాతీయ నాయకత్వం ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు వెల్లడించారు. ఇక తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవికి, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ఆది వారం నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ కేంద్రమంత్రి శోభా కరండ్లజే సమక్షంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. రామచందర్‌రావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ స్వీకరించనున్నారు. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన రామచందర్ రావుకే సంఘ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. మంగళవారం రామచందర్ రావు పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇదిలావుంటే గోషామహల్ ఎమెల్యే మరోమరు సంచలన ప్రకటన చేశారు. తెలంగాణలో భాజపా అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక వ్యక్తిని అధిష్ఠానం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. అధ్యక్షుడిని బూత్ కార్యకర్త నుంచి ముఖ్య నేత వరకు ఓటేసి ఎన్నుకోవాలి. నావాడు, నీవాడు అంటూ నియమించుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం. తెలంగాణలో భాజపా అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలి' అని రాజాసింగ్ పేర్కొన్నారు.

# బనకచర్లకు అనుమతులు ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పునకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అభిప్రాయ పడింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వపై కేంద్రంతో అధ్యయనం, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు, పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతివ్వడానికి సాధ్యమవుతుందని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను తిప్పిపంపింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించింది. కాగా, ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి చాలా ఫిర్యాదులు అందాయి. ఈ ప్రాజెక్టును మొదటి నుంచి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వెంటనే ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్రానికి ఫిర్యాదులు చేసింది. ఈ క్రమంలో బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఏపీ పంపిన ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కమిటీ.. అనుమతులు ఇవ్వడానికి తిరస్కరించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే గోదావరి ట్రిబ్యూనల్ తీర్పు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్ట్ గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమంటూ అనేక ఫిర్యాదులు వచ్చాయని కమిటీ వెల్లడించింది.

# ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదంలో గాయపడినవారిని హరీష్ రావుతో పాటు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రావు కలిసి పటాన్ చెరులోని ధ్రువ ఆసుపత్రిని సందర్శించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదం జరిగి ఐదు గంటలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 150 మంది వరకు కార్మికులు ఉన్నారని, అయితే ఇప్పటివరకు 60 మంది ఆచూకీ లభించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అస్పత్రిలో 11 మంది గాయపడిన వారు చికిత్స పొందుతుండగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్నారు. వెంటనే మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని.. దీనికోసం జిల్లాకు చెందిన ఎస్పీ, కలెక్టర్ లను ఫోన్ ద్వారా సంప్రదించి.. పరిస్థితి విషమంగా ఉన్న వారిని హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అంతేకాకుండా, ఈ ఘటనలో మరణించిన కార్మిక కుటుంబాలకు తక్షణమే రూ. కోటి ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వంను ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలు తమ బంధువుల ఆచూకీ లేక ఆందోళనకు గురవుతున్నాయని తెలిపారు.

# బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కవిత విమర్శలు
- 17న రైల్ రోకో కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జూలై 17న రైల్ రోకో నిర్వహించిన తీరుతామని తేల్చిచెప్పారు. సోమవారం తన నివాసంలో సింగరేణి జాగృతి రూపొందించిన రైల్ రోకో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసి సమాజం, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు వేర్వేరు బిల్లులు పాస్ చేసిందని గుర్తు చేశారు. ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు వెంటనే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకే తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన రైల్ రోకో చేసి తీరుతామని తెలిపారు. రైల్ రోకోకు సింగరేణి జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని వెల్లడించారు. బిసిల రిజర్వేషన్ల పెంపు, రైల్ రోకో అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జూలై 16, 17, 18 తేదీల్లో ఎవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని ఎంఎల్‌సి కవిత మరోసారి విజ్ఞప్తి చేశారు. ÷ంగరేణి కాలరీస్ సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంఎల్‌సి కవిత డిమాండ్ చేశారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు సర్వేయర్ కోర్సు పూర్తి చేసి డిజిఎంఎస్ నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి సర్వేయర్ కోర్సు పూర్తి చేసిన వారి కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.




# బిసిలంటేనే కాంగ్రెస్ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

మీ పార్టీ నాయకులే వాపోతున్నారు.. దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. ఇకపోతే, సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమ న్నారు. బీసీల ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి రెడ్డి ఉంటే, టీపీసీసీ అధ్యక్షుడిని బీసీని చేసుకున్నా మన్నారు. మేము ఒకవైపు కులగణన చేసుకొని బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ శాసన సభలో చట్టం చేసుకొని సామాజిక న్యాయం కోసం ముందుకుపోతుంటే.. బీజేపీ మరోసారి బీసీల గొంతు కోసిందని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల కోసం నినాదాన్ని ఎత్తుకున్నారన్నారు. తెలంగాణలో దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు న్యాయం జరిగేది కాంగ్రెస్‌తోనే సాధ్యం అంటూ తెలియచేశారు. గతంలో బీజేపీ అధ్యక్షుడు బీసీ నేత బండి సంజయ్ ఉంటే ఎన్నికల సమయంలో ఆయనను తొలగించి కిషన్ రెడ్డిని అధ్యక్షుడిని చేసారని గుర్తు చేశారు.

# స్వేచ్ఛ ఆత్మహత్యలో పూర్ణ ప్రమేయం లేదు

- పూర్ణచందర్ అమాయకుడని భార్య స్వప్న వ్యాఖ్య



**హైదరాబాద్,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ టీవీ చానల్ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నిందితుడు పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడని స్వప్న సంచలన వ్యాఖ్యలు చేశారు. పూర్ణ చందర్ ద్వారానే స్వేచ్ఛ తనకు పరిచయం అయిందన్నారు. అయితే, వారిద్దరి మధ్య సంబంధం గురించి ముందు తనకు తెలియదన్నారు. వారిద్దరి వ్యవహారం తెలిశాక పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు. పూర్ణచందర్‌పై స్వేచ్ఛ కూతురు అరణ్య చేస్తున్న ఆరోపణలు అసత్యమని, అరణ్యను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ నన్ను మానసికంగా టార్చర్ చేసిందని, స్వేచ్ఛ పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని భయపెట్టిందని స్వప్న వివరించారు. ÷ాగా, స్వేచ్ఛ వోటార్కర్ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్‌ను పోలీసులు నిన్న అరెస్ట్ చేశారు. అతడి వేధింపుల కారణంగానే తమ కూతురు మరణించినట్టు చిక్కడపల్లి పోలీసులకు స్వేచ్ఛ తండ్రి ఫిర్యాదు చేయడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ నేపథ్యంలోనే నిందితుడు పూర్ణచందర్ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వేచ్ఛ, నేను స్నేహితులుగా ఉండేవాళ్లం. ఐదేళ్లుగా ఆమె మానసికంగా ఆందోళన చెందుతూ చికిత్స పొందుతుంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి. స్వేచ్ఛ ఆత్మహత్యతో నాకు ఏలాంటి సంబంధం లేదని లేఖలో పూర్ణచందర్ పేర్కొన్నారు.

# ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి...

- ఇండ్ల స్థలాలు,పెన్షన్‌లు ఇవ్వాలి..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి..
- ఉద్యమకారుల ఫోరం దీక్షా శిబిరంలో జెఎసి నాయకుల డిమాండ్...



**జగిత్యాల,జూన్30(పీసీడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డిఓ కార్యాలయం ఎదుట తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం శాంతి యుత దీక్షలు చేపట్టారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఈ దీక్షా శిబిరాన్ని తెలంగాణ ఉద్యమ జెఎసి నాయకులు చుక్క గంగారెడ్డి, సిరిసిల్ల రాజేందర్ శర్మ లు సందర్శించారు. దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియ పరచారు. దీక్షా శిబిరంలో కూర్చొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమకారులకు చేస్తున్న అన్యాయాలను, ఉద్యమ ఆకాంక్షలను ఈ చర్చించారు. దీక్షా శిబిరం ను ఉద్దేశించి చుక్క గంగారెడ్డి, సిరిసిల్ల రాజేందర్ శర్మ లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం ఉద్యమకారులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, రచయితలు అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఉద్యమం పేరుతో గద్దె నెక్కిన గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదన్నారు.ఉద్యమకారులను అండగా ఉంచుకొని గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నేటికీ ఉద్యమ కారులను గుర్తించక పోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు తగిన న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతగానో పోరాటాలు చేశామని, ఉన్న ఉపాధిని పోగొట్టుకొని, భార్యా పిల్లలను సైతం వదిలి పెట్టీ రోడ్లెక్కి ఉద్యమాలు చేయడంతోనే తెలంగాణ సాధ్యం అయిందన్నారు. అలాంటి ఉద్యమకారులకు ఎలాంటి గుర్తింపు గానీ, తగు ప్రభుత్వ సాయం గానీ అందించక పోవడం శోషనీయం అన్నారు. గత ఏడాది చేపట్టిన ప్రజా పాల నలో ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం నేటికీ ఆ ఊసే ఎత్తక పోవడం బాధాకరం అన్నారు. ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికి పెన్షన్, ఇంటి స్థలాలు, గుర్తింపు కార్డుకు ఇవ్వాలని, ఆ స్థలాలలో ఇండ్ల నిర్మాణం కూడా ప్రభుత్వమే చేసి ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవులలో ఉద్యమకా రులకు అవకాశం కల్పించాలని కోరారు. వెంటనే ఈ ప్రభుత్వం కూడా స్పందించి ఈ డిమాండ్లతో పాటు తెలంగాణ ఉద్యమ కారుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తగిన గుణ పాఠం చెప్పి తీరుతామని పేర్కొన్నారు.

# సిపిఐ జిల్లా మూడవ మహాసభలు జయప్రదం చేయండి

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి

**కురవి, జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవిలో జూలై 5, 6 తేదీల్లో నిర్వహించబోయే సిపిఐ జిల్లా 3వ మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ..,భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ళ ఘన చరిత్ర కలిగిన పార్టీ 1925 డిసెంబరు 26న కాన్పూర్ లో స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీకి ఈ ఏడాది తో వందేళ్లు పూర్తి అవుతున్నదని తెలిపారు. సింగారు వేలు చిట్టియార్ కార్యదర్శి గా ఘూటే అధ్యక్షుడిగా తొలిసారిగా కాన్పూర్లో ప్రారంభమైన భారత కమ్యూనిస్టు పార్టీ సోషలిజం స్థాపనే ధేయంగా కష్ట జీవుల రాజ్యము రావాలనే లక్ష్యంతో ప్రారంభించబడినది అని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు భారత దేశంలో అనేక పోరాటాలు చేసిన ఘనత సీపీఐ పార్టీ కి ఉంది. సిపిఐ పోరాట ఫలితంగా దేశంలో అనేక చట్టాలు వచ్చాయని, బ్యాంకుల జాతీయము, వెట్టిచాకిరి విముక్తి రాజ భరణాల రద్దు, శివాయ జమా చట్టం, భూసంస్కరణ చట్టం, ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టాలే కాకుండా ప్రజలకు అనుకూలమైన అనేక చట్టాలు రావడంలో కీలక పాత్ర పోషించింది సిపిఐ పార్టీ అని తెలిపారు. స్వతంత్ర పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర ప్రముఖమైంది, ఎందరో కమ్యూనిస్టు నాయకులను స్వాతంత్ర ఉద్యమంలో బలి దానం కావడం జరిగింది అన్నారు. దున్నేవాడికే భూమి కావాలని జమీందారీ జాగీర్దారి వ్యవస్థ పోవాలని భూస్వాముల వద్ద వందల వేల ఎకరాలు కేంద్రీకరించడం సరికాదని, ఆ భూములు పేదలకు పంచాలని సిపిఐ జరిపిన పోరాట ఫలితంగానే భూ సంస్కరణ చట్టం వచ్చిందని తెలిపారు. నైజాం నవాబుల దుష్ట పాలన నుండి తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేసి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచినటువంటి పోరాటం చరిత్రలో నిలిచిపోయిన సువర్ణ ఘట్టం అని తెలిపారు. అంటరానితనం, సాంఘిక దురాచారాలు, సాంఘిక దౌర్జన్యాలు, పెత్తందారీ విధానాలు అంతం చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ.., నిత్యం ప్రజల పక్షాన నిలబడి, కార్మికుల, కర్షకుల, కష్టజీవుల సమస్యలపై ఎనలేని పోరాటాలు చేయడం జరిగిందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆంగ్లేయుల పాలనలోనూ స్వతంత్రం వచ్చిన తరువాత కూడా అనేక కష్టాలను నిర్బంధాలను ఎదుర్కొన్నా, నమ్మిన సిద్ధాంతాన్ని పట్టిన జెండాను వదలకుండా వందేళ్లుగా దేశం కోసం ప్రజల కోసం నిలబడిన పార్టీ సిపిఐ అటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ సంస్థగతంగా మహాసభలు జరుపుకోవడం ఆనవాయితీ గా వస్తోందన్నారు. జులై 5, 6 తేదీల్లో జిల్లా మూడవ మహాసభలు కురవిలో జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభలలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రూపకల్పన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ జిల్లా మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ డా. రాంచంద్రు నాయక్, ముఖ్యఅతిధులుగా పాల్గొంటారని తెలిపారు. మహాసభలకు మేధావులు, పార్టీ నాయకులు, పార్టీ అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని వారు పిలుపునిచ్చారు.

# తెలంగాణ త్యాగాలు ఎవరివి భోగాలు ఎవరికి..?

**నర్సంపేట, జూన్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలతో ఉద్యమాలతో అమరవీరుల ఆత్మబలిదానాలతో వచ్చిన తెలంగాణ లో అన్ని రంగాల్లో ఉద్యమ కారుల వాటా ఎంతతొలిదశలో 369 మలిదశలో 1200 పైగా తెలంగాణ ఉద్యమ కారులు మరణించటం జరిగింది. వేల మంది తమ కుటుంబాలను పక్కన పెట్టి చేసే వ్యాపారాలను ప్రైవేటు ఉద్యోగాలను పక్కన పెట్టి విద్యార్థులు తమ చదువులను పక్కన పెట్టీ తెలంగాణ రాష్ట్ర సాధన ద్యేయంగా ఉద్యమించటం జరిగింది. మలిదశ ఉద్యమంలో ఏ పిలుపునిచ్చిన విజయవంతం చేయటం కోసం లాఠీ దెబ్బలను సహితం లెక్క చేయకుండా ఉద్యమించటం జరిగింది.జైలు జీవితాలు గడపటం జరిగింది.కుటుంబాల పోషణ కోసం చేస్తున్న పనులను సహితం వదిలి పెట్టీ ఉన్న ఆస్తులను అమ్మి కొందరు అప్పులు చేసి కొందాం ఉద్యమాన్ని నడిపించటం జరిగింది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం.వచ్చిన తెలంగాణ లో తెలంగాణ ఉద్యమకారుల కి ఏమి వచ్చింది. ప్రతి ఉద్యమ కారుడు ఆత్మ విమర్శ చేసుకోండి.ఆత్మ బలిదానాలు చేసుకున్నది ఎవరు? లాఠీ దెబ్బలు తిన్నది ఎవరు?బుల్లెట్ గాయాలు అయింది ఎవరికి కుటుంబాలను పక్కన పెట్టీ తెలంగాణ రాష్ట్ర సాధన ద్యేయంగా ఉద్యమం చేసింది ఎవరు ఆస్తులు అమ్ముకొని అప్పులు చేసి ఉద్యమాలు చేసింది ఎవరు?చదువులు కొలువులు నష్ట పోయింది ఎవరు?లిఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు జండాలు మోసి జైళ్ల పాలయి అప్పుల పాలయి లాఠీ దెబ్బలు తిని బుల్లెట్ గాయాలు అయింది పెట్రోలు తో శరీరాలను కాల్చుకున్నది ఎవరు?వచ్చిన తెలంగాణ లో ప్రజా ప్రతినిధులు అయింది అవుతుంది ఎవరు? విలాస జీవితాలను నేడు గడుపుతుంది ఎవరు? కనీసం కుటుంబ అవసరాలు కూడా తీర్చు కోలేని స్థితిలో దయనీయ స్థితిలో జీవిస్తుంది ఎవరు, ఇంకా జండాలు మోసే కూలీలు గా ఉన్నది ఎవరు? జల్సా జీవితాలు గడుపుతుంది ఎవరుఉద్యమ సమయంలో నాయకత్వం వహించిన నాయకుల ఆస్తులు ఎన్ని నేడు వాళ్ళ ఆస్తులు ఎన్ని,సినిమా రంగం విద్యా రంగం మీడియా రంగం కార్పొరేట్ రంగం అన్ని రంగాలలో ఎవరి ఆధిపత్యం ఉన్నది నేడు, ప్రజా ప్రతినిధులు గా ఎవరు అవుతున్నారు , ఉద్యమ కారులా, ఉద్యమ ద్రోహుల,త్యాగాలు ఎవరివి భోగాలు ఎవరికి?చూస్తూ ఉందామా ? ఆలోచించండి



తెలంగాణ ఉద్యమ కారులారా మన త్యాగాలతో ఉద్యమాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ కారుల దుస్థితి ను చూడండి. రాజకీయ రంగం లో అవకాశాలు లేవు పైసలు ఉన్న కార్పొరేట్ ఉద్యమ ద్రోహులు కే అవకాశాలు అన్ని పార్టీలలో నామినేటెడ్ పదవులు లలో అవకాశాలు తక్కువ ఉద్యమ కారుల కి . ఉద్యమ కారుల సంక్షేమం కోసం గొంతు ఎత్తే పార్టీలు కనపడటం లేదు. ఉద్యమ కారుల ద్వారా వచ్చిన తెలంగాణ లో ఉద్యమ కారుల సంక్షేమం గురించి ఆలోచించే రాజకీయ నాయకులు పిడికెడు మంది కూడా లేరు.గత 7 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మ గౌరవం సంక్షేమం కోసం మన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ పని చేస్తుంది.తెలంగాణ ఉద్యమ కారుల కి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రియతమ ముఖ్య మంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారిని డిమాండ్ చేస్తున్నాం ఒక కమిటీ ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమ కారుల ను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలి సంక్షేమ పథకాలు లో 20 శాతం కోటా ఉద్యమ కారులకి కేటాయించాలి.తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలి.తెలంగాణ ఉద్యమ కారులారా తెలంగాణ ఉద్యమ కారుల హామీల అమలు కోసం జూన్ 30 సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా శాంతి యుత దీక్షలు నిర్వ? హిస్తున్నాం ఈ దీక్షలు కు ప్రతి ఉద్యమ రాజకీయ నాయకులు నాయకురాలు ప్రజా సంఘాలు కుల సంఘాలు కవులు కళాకారులు సంఘీభావం ప్రకటించాలని కోరుతున్నాం. తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మ గౌరవం సంక్షేమం సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ తెలంగాణ పునర్ నిర్మాణం మా లక్ష్యం. ఖానాపూర్ తెలంగాణ ఉద్యమ, కారుల ఫోరమ్ సాంబరాజు ఒక ప్రకటన లో తెలిపారు.

# గురుకుల పాఠశాలలలో శ్రీవాణి బలవన్మరణం కలిచివేసింది..

- పేదపిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం..
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..

**పరకాల,జూన్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):**పరకాల మండలంలోని మల్లక్కపేట గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఏకు శ్రీవాణి హాస్టల్ గదిలో ఉరివేసుకొని బలవన్మరణం పాల్పడిన ఘటన ఎంతో కలిచివేసినదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.శ్రీవాణి ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు.ఈ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంన్నర కాలంలో గురుకుల పాఠశాలలలో ఇలాంటి సంఘటనలో ఎన్నో జరిగాయన్నారు. సంఘటన తెలిసిన వెంటనే తాను అందుబాటులో లేకున్న సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు.ఈ ఘటనకు పూర్తి భాద్యులు అధికారులదేనని అన్నారు.తెలిసి తెలియని వయసులో పిల్లలు తప్పుచేస్తే కౌన్సిలింగ్ చేసి సరిదిద్దాల్సిన బాధ్యత గురుకుల యాజమాన్యానిదని అన్నారు.కానీ ఈ గురుకుల పాఠశాలలో విద్యార్థినులను యాజమాన్యమే బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిసిందన్నారు.ఆ భయంతో చిన్నారులు ఇలాంటి ఘటనలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పేదపిల్లల ప్రాణాలతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నడని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనతో మిగతా పిల్లల తల్లితండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.శ్రీవాణి కుటుంబాన్ని అండగా ఉంటామని,ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి కారణమైన వారిని శిక్షించే వరకు ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.



# ఎక్సైజ్ ఆధ్వర్యంలో వాహనాల వేలం

**పరకాల, జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వివిధ నేరాల పై పట్టుబడిన వాహనాలను జిల్లా ప్రో., ఎక్సైజ్ అధికారి వరంగల్ రూరల్ ఆదేశను ప్రకారం తేదీ.02.7.2025 (బుధవారం ) రోజున ఉదయం 11:00 గంటలకు ప్రో., ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వేలం వేయబడునని, కావున ఆసక్తి కలిగినవారు ప్రో.,ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వాహనం అప్ సెట్ ప్రైస్ పై 50% డిపాజిట్ గా చెల్లించి వేలం లో పాల్గొనవచ్చని పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆర్యవైశ్య సంఘం సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి





**వరంగల్, జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్యవైశ్య సంఘం సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు.ఆర్యవైశ్య సంఘం నాయకులు తమ సంఘం సమస్యలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి దృష్టికి తీసుకురావడం జరిగింది వెంటనే స్పందించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమస్యలు విని తెలుసుకొని అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు.వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు, ఆర్యవైశ్య అధ్యక్షులు గట్టు మహేష్ బాబు, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు,కార్పొరేటర్లు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,మహిళా నాయకులు, యూత్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగాధర పోలీస్ స్టేషన్ ఎఎస్సై కిష్టయ్య పదవీ విరమణ



**గంగాధర, జూన్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు గంగాధర పోలీస్ స్టేషన్ లో గత కొన్ని నెలలుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ కిష్టయ్య తన పదవి విరమణ చేస్తున్న సందర్భంగా గంగాధర ఎస్సై వంశీ క్రిష్ణ పోలీస్ స్టేషన్ లో కిష్టయ్య కి తన కుటుంబ సభ్యులు, మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది సమక్షంలో ఘనంగా సత్కరించారు,ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ కిష్టయ్య తన 38 సంవత్సరాల సర్వీసులో పోలీస్ డిపార్ట్మెంటుకు ఎన్నో సేవలు అందించారు. పదవి విరమణ తర్వాత కూడా తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి అని కోరుకుంటూన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వంశీ క్రిష్ణ మరియు కుటుంబ సభ్యులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి నిత్యవసర సరుకుల అందజేత

**చిట్యాల, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే కాగా గ్రామపంచాయతీ స్థాయి ఉద్యోగులు కలిసి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యంతో కూడిన రూ.5 వేల విలువ గల నిత్యవసర సరుకులను అందజేసి సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి అజీర బేగం, ఉపాధ్యాయుడు దశరథం, అంగన్వాడీ టీచర్లు కవిత, రజిత, ఆయా శోభ, సిఏ రాజయ్య, బిపిఎం రామకృష్ణ, జిపి సిబ్బంది రాణి పాల్గొన్నారు.



## డాగ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు





**గంగాధర, జూన్ 30 (పిసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కేంద్రం లోని మధురానగర్ చౌరస్తాలో ఈరోజు సాయంత్రం గంగాధర ఎస్సై వంశీ క్రిష్ణ మరియు డాగ్ స్క్వాడ్ సిబ్బంది తొ కలసి మాదక ద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాలు ఏమైనా అక్రమంగా విక్ర్యయిస్తున్నారమేవో అని పాన్ షాపులు, వైన్స్ పరిమిడ్ రూమ్స్‌లో మరియు ఇతర కిరాణం షాప్ లో స్వీట్ హౌస్‌లో తనిఖీలు చెయ్యడం జరిగింది.

## పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శ



**చిట్యాల, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలాల్లోని వివిధ గ్రామాలల్లో పర్యటించారు. ఆయా గ్రామాలల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక నేతలతో కలిసి పరామర్శించారు. చనిపోయిన వారి చిత్రపటాల వద్ద ఎమ్మెల్యే పూలు వేసి నివాళులర్పించారు. ఇలాంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఆ భగవంతుడు మనోధైర్యాన్ని అందించాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరుకున్నారు చిట్యాల మండలంలో.. తిరుమలాపూర్ గ్రామంలో కంచర్ల పోషాలు, చిట్యాల మండల కేంద్రంలో చింతకింది రాజమణి, నవాబుపేట గ్రామంలో మహమ్మద్ హకీమ్, కైలాపూర్ గ్రామంలో సకినాల కుమారస్వామి ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు..ఈ పరామర్శ కార్యక్రమాల్లో చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి .జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య. జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ.. నాయకులు చిలకల రాయ కొమురు మాజీ ఎంపీటీసీ అనిల్ కుమార్. మండల యూత్ అధ్యక్షులు అల్లకొండ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## పెద్దమ్మ తల్లి బోనాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, జూన్ 30 (పిసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలకేంద్రంలో ముదిరాజుల కుల దైవం శ్రీ పెద్దమ్మ తల్లి బోనాలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి హాజరై అమ్మవారిని దర్శించుకున్న గౌరవ చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుడుకి ఆర్థిక సహాయం: బిఎన్ రావు...



**కరీంనగర్,జూన్30(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుడు ఆమరణ నిరాహార దీక్ష చేసిన న్యాయవాది మన్నే పరంజ్యోతి ఆరోగ్యం క్షీణించి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించిన బిఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.ఎన్.రావు డాక్టర్ అలీమ్ కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ప్రముఖ సామాజికవేత ఎం శ్రీనివాస్ కుమార్, తెరాస నేత మాజిద్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక నేతగా అడ్వకేట్ జేఏసీ కరీంనగర్ విభాగంలో కీలకంగా వ్యవహరించి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఢిల్లీలో సైతం తన గళాన్ని వినిపించి ఉద్యమమే ఊపిరిగా పోరాడిన తెలంగాణ పోరాటయోధుడు మన్నే పరంజ్యోతి న్యాయవాదికి ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని మానవతా దృక్పథంతో బిఎన్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించి మరిన్ని వైద్య సేవలు అందించడానికి డాక్టర్ బి.యన్ రావు ముందుకు రావడం జరిగింది ఇప్పటికైనా టిఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులను గుర్తించి ఆర్థికంగా సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుచున్నారు. ఉద్యమ కారులకు గుర్తించి ప్రభుత్వం తగిన విధంగా సహాయం అందించాలని కుటుంబీకులు కోరుచున్నారు.

# గాంధీ భవన్ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి...





**హైదరాబాద్,జూన్30(పీసీడబ్ల్యూ న్యూస్):** గాంధీ భవన్ ప్రజాపాలనలో భాగంగా ప్రతి రోజు ఇద్దరు కార్పోరేషన్ చైర్మన్లులలో నరేందర్ రెడ్డి పక్కన సంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల, గాంధీభవన్ లో దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం గాంధీ భవన్ నుండి గత ఇరవైరోజుల క్రితం షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని అందులో భాగంగా సోమవారం నాతో పాటు సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల పాల్గొనడం జరిగిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు.అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ముప్పై వరకు వివిధ సమస్యలతో వచ్చిన దరఖాస్తులు స్వీకరించి అక్కడికక్కడే కొన్ని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగిందని మిగితా దరఖాస్తులు సంభందిత శాఖలకు పరిష్కారానికి పంపడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమం ఒకవైపు కొనసాగుతూనే ప్రజల యొక్క వివిధ సమస్యలపై నాయకులు ఎక్కడికక్కడ పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు.ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములమైనందుకు సంతోషంగా ఉందని నరేందర్ రెడ్డి మరియు వెన్నెల పేర్కొన్నారు.

# సీఈఐఆర్ సాంకేతికతతో లక్ష విలువైన 5 చరవాణులు స్వాధీనం చేసుకున్న హుజూరాబాద్ పోలీసులు



**హుజూరాబాద్, జూన్30(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్ పట్టణంలో తరచుగా జరుగుతున్న చరవాణుల దొంగతనాలపై దృష్టి సారించిన హుజురాబాద్ పట్టణ సీఐ కరుణాకర్ , ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఐదు చరవాణులను విజయవంతంగా స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని అంచనా.పోలీసులు కొత్తగా అందుబాటులోకి వచ్చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాంకేతికతను ఉపయోగించి ఈ చరవాణులను గుర్తించారు. స్వాధీనం చేసుకున్న చరవాణులను వాటిని పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అప్పగించారు. తమ చరవాణులు తిరిగి వచ్చినందుకు బాధితులు పోలీస్ అధికారి కరుణాకర్ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ, తమ పరిధిలో ఎవరైనా చరవాణులు పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ సాంకేతికత సహాయంతో పోగొట్టుకున్న చరవాణులను గుర్తించి, తిరిగి అప్పగించడానికి తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ చీఫ్ ఇంజనీర్ శంకర్ పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గడ్డం వివేక్

**బెల్లంపల్లి, జూన్ 30(పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ లక్డికాపూల్ లో రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్ పదవి విరమణ కార్యక్రమానికి గనులు, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముడిమడుగుల శంకర్ పదవి విరమణ కార్యక్రమంలో శాలువతో సన్మానించడం జరిగింది. 38 సంవత్సరాల సేవలు ఉద్యోగ సేవలో వివిధ హోదాలో పనిచేసిన ముడిమడుగుల శంకర్ ను కొనియాడారు. సింగరేణి ఏరియా నుండి అత్యుత్తమ స్థాయి ఎదిగి గిరిజన శాఖ అభివృద్ధికి తన వంతు సహాయం అందించారని మంత్రి వివేక్ అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ డిపి రాజేష్ నేహతా, రంగ ప్రశాంత్ సామాజిక కార్యకర్త, రాష్ట్ర గిరిజన శాఖ చీఫ్ సూపర్డెంట్ వివిఎన్ శాస్త్రి, రజిని కుమార్, ఆర్ కె గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.




# ఎన్నికల కమిషన్ కొండ సురేఖ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- బిజెపి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు..



**వరంగల్, జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్. 2023 తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఎన్నికల నియమాలుకి విరుద్ధంగా రూ,, 70 కోట్లు ఖర్చు చేసిలి తన సతీమణి కొండా సురేఖను గెలిపించానని భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని ఎన్నికల కమిషన్ కొండ సురేఖ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు వరంగల్ ఓసిటీ క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు ఆదివారం వరంగల్లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న కొండా మురళీధర్ రావు గారు తన భార్య కొండా సురేఖ గారి గెలుపు కొరకు 16 ఎకరాలు భూమి అమ్మి 70 కోట్లు ఖర్చు చేశానని సమావేశంలో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. 2023 ఎన్నికల అఫిడవిట్లో తన పేరు మీద ఒక ఎకరం, తన భర్త కొండా మురళి పేరున 13.31 ఎకరాలు ఉన్నాయని వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ప్రస్తుత రాష్ట్ర మంత్రి కొండ సురేఖ పొందుపరిచారని, కొండా మురళి 2025జూన్ 28న ఆదివారం వరంగల్ లో జరిగిన సమావేశంలో మాట్లాడినప్పుడు ప్రస్తుతం తనకు 500 ఎకరాల భూమి ఉందని 16 ఎకరాలమ్మి రూ. 70 కోట్లు ఖర్చు చేశానని చెప్పారని, కొండా మురళి గారు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు సమర్పిస్తానని చెప్పారు. ఎన్నికల అధికారులు విచారణ చేపట్టి సురేఖ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతామన్నారు అడ్డదారిలో వరంగల్ తూర్పు నుంచి గెలిచి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కొండ సురేఖ గారు నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# టీఎంజేఏ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడుగా చంద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బేతమల్ల సహదేవ్





**మహబూబాబాద్ జిల్లా, జూన్30 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మాల జర్నలిస్ట్ అసోసియేషన్(టి ఎంజెఏ)ద్వితీయ వార్షికోత్సవం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రగతి పబ్లిక్ స్కూల్లో ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డు అశోక్ అధ్యక్షతన మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎంజెఏ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా అనుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా తిరిగి రెండవసారి చందా శ్రీనివాస్(మహబూబాబాద్), ప్రధాన కార్యదర్శిగా బేతమల్ల సహదేవ్(కురవి), గౌరవ అధ్యక్షులుగా బొడ్డు అశోక్(నెల్లికుదురు), జిల్లా అధికార ప్రతినిధిగా దార్ల బాస్కర్ (ఇనుగుర్తి), ఉపాధ్యక్షులుగా గాజుల రవి(కేసముద్రం), గండమల్ల రోశయ్య(కురవి), అనపర్తి వీరన్న(దంతాలపల్లి), బేతమల అశోక్(నరసింహుల పేట), వెలిశాల శ్యామ్(తొర్రూర్), సహాయ కార్యదర్శిలు గా బండ రాజ్ కుమార్(మహబూబాబాద్), గండమల్ల రామకృష్ణ( మహబూబాబాద్), మెర్గు సంజీవ(మరిపెడ), కోశాధికారిగా సందా అనిల్(నెల్లికుదురు), ప్రచార కార్యదర్శులుగా కొప్పుల శ్రీనివాస్(కురవి), చదల యాకాంతం(నెల్లికుదురు), సలహాదారులుగా గులగట్టు దాసు(దంతాలపల్లి), పల్లె యాకాంతం(తొర్రూర్), చిలువేరు ఉపేందర్( నరసింహుల పేట)ల తోపాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. త్వరలో కురవి, గూడూరు, కొత్తగూడ, గంగారం తదితర మండలాల్లో నూతన కమిటీలు వేయనున్నట్లు నూతన జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పాశమైలారం ఘటనపై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

- జరిగిన ఘటన బాధాకరం, దురదృష్టకరం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే పోలీస్, ఫైర్ సహా అన్ని డిపార్ట్‌మెంట్లు వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాయి.3 అంతస్తుల భవనం కూలిపోయింది.ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.సుమారు 65 మంది ఘటన జరిగిన సమయంలో పనిలో ఉన్నారు.క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నాం.వారికి పూర్తి చికిత్స ఉచితంగా అందించే బాధ్యత మా ప్రభుత్వానిదిఇప్పటివరకు 12 మంది చనిపోయినట్టుగా తెలుస్తోంది.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. ప్రతి కార్మికుని కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యత, ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వానిది.ఇలాంటి దుర్ఘటనలను రాజకీయం చేసి, వ్యక్తిత్వం దిగజార్చుకోవద్దు.ఇలాంటి పరిస్థితుల్లో అందరం బాధితులకు అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిది.

## సిగాచి పరిశ్రమను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి కెమికల్స్ పరిశ్రమలో ఈ రోజు ఉదయం రియాక్టర్ అకస్మాత్తుగా పేలి భారీ అగ్నిప్రమాదం సంభవిoచింది.పేలుడు ధాటికి పరిశ్రమలో మంటలు వ్యాపించాయి.ఈ ప్రమాదంలో కొందరు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, కొందరికి తీవ్రగాయాలు అవ్వడంతో వారిని తక్షణమే సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ సంఘటన స్థలానికి చేరుకొని పరిశ్రమ పరిసరాలను పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి వివేక్ వెంకటస్వామి,పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్.

# ప్రైవేటు బడులకు ధీటుగా సర్కార్ బడులు నిలవాలి...

- ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యం పెంచుకోవాలి
- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...





**మానకొండూర్,జూన్30(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులు నిలవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న ప్రహరీగోడ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పనకు వేగవంతమైన చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. సౌకర్యాల కల్పనతోనే సరిపోదని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెరిగితేనో ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ఎదగగలుగుతామని ఆయన పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు పెంచడమే కాకుండా విద్యార్థుల ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలను వారి తలరాతలను మార్చగలిగే శక్తి సామర్థ్యాలు గురువులకు ఉందని తాను గట్టిగా నమ్ముతున్నానని చెప్పారు. అదే విధంగా ఉపాధ్యాయులు కూడా వారి బోధనా సామర్థ్యాలు పెంచుకుంటూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాన్ని బోధించడానికి ముందుగానే ఎంత మంది ఉపాధ్యాయులు పాఠం చదవి నోట్స్ తయారుచేసుకుంటున్నారో పంతుళ్లు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. అలాగే తెలుగు, ఆంగ్ల మాధ్యమాలకు చెందిన ఉపాధ్యాయులు కూడా వారి భాషల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కవ్వంపల్లి పేర్కొన్నారు. ప్రతి గురువు పాఠాలు చెప్పేందుకు అవసరమైన నోట్స్ తయారు చేసుకున్నారా లేదా, ఆంగ్ల ఉపాధ్యాయులు విధిగా ఆంగ్ల వార్తాపత్రికలు చదువుతున్నారా లేదా ,తెలుగు ఉపాధ్యాయులు కాంపోజిషన్స్ రాస్తున్నారా లేదా, గణిత ఉపాధ్యాయులు గణితం, అబాకస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ వంటి అంశాల్లో దృష్టి సారిస్తున్నారా లేదా ఒకసారి పరిశీలన చేసుకుని ఆ దిశగా దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు. సులువుగా అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు విద్యార్థులు అభిమానులుగా మారిపోతారని, విద్యార్థుల ఫాలోయింగే ఉపాధ్యాయుల సమర్థతకు నిదర్శనమని కవ్వంపల్లి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నెపోలియన్ బోనపార్టీ, బెనిటో ముస్సోలిని, అడాల్ఫ్ హిట్లర్ , ఇల్విచ్ ఉల్యానోవ్ వ్లాదిమిర్ లెనిన్ ల గురించి ప్రపంచ యుద్దాలు గురించి ఎమ్మెల్యే కవ్వంపల్లి సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రేమిడి తిరుమల్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాస్ రెడ్డి,బి.మహేందర్, బుర్ర శ్రీధర్, మడుపు ప్రేమ్ కుమార్, వెంకటేష్, మీస సత్యనారాయణ, మాడ తిరుపతిరెడ్డి, మాతంగి సహదేవ్, సునిల్, వంగల మల్లేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శనంతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు డ్రెస్సులు అమ్మినట్టు సమాచారం వస్తే తప్పకుండా తగు చర్యలు

**- తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్**

**భూపాలపల్లి. జూన్ 30 (పిసి డబ్ల్యూ న్యూస్):** బిట్స్ బాలాజీ ప్రైవేట్ పాఠశాలల్లో అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్నారని ఆధారాలతో డిఇఓ ఎంఈఓ కి చెప్పడం జరిగింది వెంటనే స్పందించిన డీఈవో ఎంఈఓ సంబంధిత పుస్తకాలు ఉన్న రూమును వెంటనే సీజ్ చేయడం జరిగింది డీఈవో ఎంఈఓ మా దృష్టికి ఏ ప్రైవేట్ పాఠశాలలో అయినా పుస్తకాలు డ్రెస్సులు అమ్మినట్టు సమాచారం వస్తే తప్పకుండా తగు చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మరియు ఏబీవీపీ సభ్యులు తో కలిసి ఇందులో పాల్గొనడం జరిగింది పేద మధ్యతరగతి కుటుంబాల లక్ష్యంగా కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలు పేదవాళ్ల రక్తాన్ని శ్రమను దోచుకుంటున్నారు దీన్ని సహించేది లేదని ఎంతటి కార్పొరేట్ పాఠశాలలైన తీన్మార్ మల్లన్న టీం ప్రతి స్కూలుకు వెళ్లి అక్కడ జరిగే అవకతవకలు బయటపెడుతుంది అధికారుల ద్వారా తగు చర్యలు తీసుకునే వరకు పోరాడుతుందని రవి పటేల్ చెప్పడం జరిగింది

# దళిత కమిషనర్‌పై కుట్రపూరిత ప్రచారం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మారపల్లి శ్రీనివాస్



**హుజురాబాద్,జూన్30(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ పురపాలక సంఘ కమిషనర్ కంసారపు సమ్మయ్యపై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, అవి కుట్రపూరిత చర్యలని ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) నాయకులు స్పష్టం చేశారు. కమిషనర్ సమ్మయ్య పట్టణ అభివృద్ధికి అద్భుతంగా కృషి చేస్తున్నారని, దళిత జాతికి చెందిన ఆయనపై ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు.కమిషనర్ సమ్మయ్య బాధ్యతలు స్వీకరించిన తర్వాత 100% ఆస్తి పన్నులు వసూలు చేసి, రాష్ట్రంలోనే హుజురాబాద్ పురపాలక సంఘాన్ని ప్రథమ స్థానంలో నిలిపారని ఎమ్మార్పీఎస్ నేతలు కొనియాడారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను కూడా వసూలు చేయడంలో ఆయన చొరవ తీసుకున్నారని తెలిపారు.పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, రోజుకు ఒక వార్డు చొప్పున మొత్తం 30 వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేసి, హుజురాబాద్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. తడి, పొడి చెత్తల వేర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల టెండర్లలో నిబంధనల ఉల్లంఘనలపై వస్తున్న ఆరోపణలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఖండించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ల కుటుంబ సభ్యులు సంబంధిత పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తే వారు టెండర్లకు అనర్హులని గుర్తు చేశారు. కరీంనగర్‌కు చెందిన దొడ్డ భరద్వాజ్ టెండర్‌పై మాట్లాడుతూ, బిడ్డింగ్ దశలో టెండర్ ధరలు తెలియవని కమిషనరేట్ వర్గాలు తెలిపినట్లు చెప్పారు. అలాగే, హుజురాబాద్ పురపాలక సంఘం ఏర్పడినప్పటి నుండి కార్యాలయంలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. గతంలో దొడ్డ భరద్వాజ్ కొన్ని పనులను అర్ధాంతరంగా వదిలేసిన విషయాన్ని ఎమ్మార్పీఎస్ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేశారు.పట్టణంలో అవసరమున్న చోట నూతన మురికి కాలువలు, రోడ్ల నిర్మాణాలకు కమిషనర్ కృషి చేస్తున్నారని, పనుల నాణ్యతను స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వారు తెలిపారు. "దళిత జాతికి చెందిన కమిషనర్ సమ్మయ్య హుజురాబాద్ పట్టణాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్న తరుణంలో కావాలని కొందరు కుట్రపన్ని చేస్తున్న ఆరోపణలను పరిగణలోకి తీసుకోకూడదు" అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మారపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రొంటాల రాజకుమార్, సీనియర్ నాయకులు కలువల సంపత్ కుమార్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ హుజురాబాద్ నియోజకవర్గ నాయకులు కలువల మల్లయ్య తదితరులు విజ్ఞప్తి చేశారు.

## నూతనంగా ఏర్పడిన డివిజన్ నెం.52లో తగు మార్పులు చేయుటకై జిల్లా కలెక్టర్‌కు వినతి



**కరీంనగర్ టౌన్, జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని ముకరంపురలో డివిజన్ నెం: 52 గా 2-7-358 నుండి 2-7-898. 2-7-898 నుండి 2-7-1009 పాతవి 60వ డివిజనులో ఉన్నప్పుడు. అందులో గల గృహాల సముదాయం సవ్యంగా ఉండెను. నూతనంగా డివిజను పరిధులు మార్పిడిలో సిరిసిల్ల 100 ఫీట్ల మేన్ రోడ్డును దాటి ఇట్టి డివిజనులో గల గృహాల నెంబర్లు 2-7-822 నుండి 2-7-1009 వరకు గల గృహాలను డివిజను నెం.64 లో కలిపినారు. 184 గృహాలు ప్రధాన సిరిసిల్ల రోడ్డు దాటి వేరే డివిజనులో కల్పినారు. తద్వారా భవిష్యత్తులో సానిటేషన్, విద్యుత్ సరఫరా, రేషన్ సరఫరా తదితర సమస్యలు ఈ గృహాల వారికి ఇబ్బంది పెడతాయి. డివిజను రూపు రేఖలు సవ్యంగా ఉండి, పౌరులకు సదుపాయాలు సవ్యంగా అందాలంటే ఈ 184 గృహాలు తిరిగి డివిజను నెం. 59 (నూతన) లో కలపాలి. 2-7-212 నుండి 2-7-275 వరకు నూతనంగా కలిపినారు. ఇవన్ని కమర్షియల్, వాణిజ్య ఆవాసాలు, ఇందులో పౌరుల సంఖ్య నామమాత్రంగా ఉంటుంది. కాబట్టి ఓటర్ల సంఖ్య పరంగా ఏమైనా ఇబ్బంది ఎదురయితే వీటిని తొలగించి పైన చెప్పిన 184 గృహాలను తిరిగి డివిజనులో కలుపాలని. డివిజను ఏర్పాటు పౌరులకు సత్వర సేవలు అందించేలా ఉండాలి అంటే ఈ మార్పు తప్పనిసరని మీ దృష్టికి తీసుకువస్తున్నామని 52వ డివిజన్ ముకరంపుర మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ అఖిల్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ద్వారా తెలియజేశారు. తగు విధంగా మార్పులు చేసి డివిజన్ పరిధిని సవరణ చేయాలని కోరారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులను పరిశీలించాలి: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్





**మహబూబాబాద్,జిల్లా జూన్.30(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రజలు తమ సమస్యలకై ప్రజావాణి లో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రెవెన్యు అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారీ తో కలిసి గ్రీవెన్స్ లో ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కేసముద్రం మండలం రంగాపురం గ్రామానికి చెందిన లేదల్ల రమాదేవి మహబూబాబాద్ మండలం సింగారం గ్రామంలో గల తన తండ్రి పేరు పైన ఉన్న భూమి ఇతరులకు పేరు మార్పిడి ఎలా జరిగింది, ఏవిధమైన పత్రాలు సమర్పించారో తెలుపగలరని సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా ప్రజావాణిలో కోరారు.తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన సరోజన తను గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న మడిపల్లి శివారులో ఉన్న భూమి ప్రొహిబిటెడ్ భూమి అని చూపిస్తుందని అట్టి దానిని సరిచేయగలరని కోరారు.కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామినికి చెందిన బోడ కవిత తను భర్త ను కోల్పోయి ఒంటరిగా ఎటువంటి ఆధారం లేకుండా జీవిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు రానీయకుండా కొంతమంది ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు ప్రయత్నిస్తున్నారని, తన కుటుంబ పరిస్థితి అలోచించి తనకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు.పట్టణంలోని బాబాగుట్ట ఎర్రబోడ్ కాలనీకి చెందిన షేక్ జరీనా తనకు ఖాళీ స్థలం ఉన్నదని, ఇల్లు లేదని ప్రభుత్వం వారు మంజూరు చేసే ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన గొల్లపల్లి రామనాథం తన తండ్రి పేరున ఉన్న భూమి మా ఇతర కుటుంబ సభ్యులు తమకు ఉన్న భూమి కంటే ఎక్కువ భూమి తమ పాస్ బుక్ లో నమోదు చేపించుకొని, ప్రభుత్వం నుండి రావాల్సిన లబ్దిని పొందుతున్నారని అట్టి సర్వే నెంబర్ లను సర్వే చేపించి తనకు రావలసిన భూమి ఇప్పించగలరని కోరారు. సోమవారం రోజున నిర్వహించిన ప్రజావాణీ లో వచ్చిన ( 148 ) దరఖాస్తులను వివిధ శాఖ ల అధికారులకు సమస్యల పరిష్కారానికై అధికారులను ఆదేశించారు.ఈ ప్రజావాణిలో జెడ్.పి. సీఈఓ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, హౌసింగ్ డి.ఈ రాజయ్య, ఏ.డి.సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, డి.ఎస్.ఓ ప్రేం కుమార్, బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ డెవలప్మెంట్ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డి.డి.గ్రౌండ్ వాటర్ సురేష్, ,డి.హెచ్.ఓ మరియన్న, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, ట్రైబల్ వేల్ఫేర్ అధికారి దేశీరాం, ఎంప్లాయ్మెంట్ అధికారి రజిత, మత్స్య శాఖ అధికారి వీరన్న, ఎల్.డి.ఎం.సత్యన్నారాయణ మూర్తి, పెన్షన్ అధికారి శంకర్, కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే సిగాచి పరిశ్రమలో భారీ ప్రమాదం

- మృతులకు కోటి రూపాయల పరిహారం, ఉద్యోగం కల్పించాలి
- ప్రతి పరిశ్రమను నిరంతరం తనిఖీ చేయాలి..
- తూతు మంత్రంగా ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తనిఖీలు
- గాయపడ్డ వారికి 50 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలి..
- అధికారులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాజమాన్యం నిర్లక్ష్యం ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల తూతూ మంత్రంగా చేపట్టే తనిఖీల మూలంగానే సిగాచి పరిశ్రమ ఘటన చోటు చేసుకుందని. పేలుడులో మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, గాయపడిన వారికి మెరుగైన వైద్యంతో పాటు 50 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పటాన్చెరు నియోజకవర్గ పాశమైలారం పారిశ్రామిక వాడలో గల సిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం రియాక్టర్ పేలుడు జరిగిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే జిఎంఆర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిఐజి ఇక్బాల్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ఎస్పీ పరితోష్ పంకాజ్ తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు.ఘటన స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పరిశ్రమను నడిపిస్తున్న సిగాచి యాజమాన్యం ఎప్పుడు కూడా కార్మికుల భద్రత కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కూడా ఇదే పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో మృతి చెందారని తెలిపారు.ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన పరిశ్రమల తనిఖీల విభాగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికుల భద్రతను గాలికి వదిలేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఒకసారి ప్రమాద సంఘటన జరిగినప్పటికిని యాజమాన్యం గుణపాఠం నేర్చుకోకుండా తిరిగి భద్రతా ప్రమాణాలు పాటించకుండా పరిశ్రమలు నడిపిస్తూ కార్మికుల పాలిట యమపాశంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి ఘటనకు కారకులైన యాజమాన్యం,నిర్లక్ష్యం వహించిన పరిశ్రమ విభాగం అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## కరీంనగర్ ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ మార్కెట్‌లో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల చొరవతో రాక్ కటింగ్ పేరుతో రూ.85 లక్షల అదనపు దోపిడి...

**- మెండి చంద్రశేఖర్ 44వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నగరపాలక సంస్థ కరీంనగర్ కార్పొరేషన్.... మున్సిపల్ కమిషనర్‌కు వినతి**

**కరీంనగర్ టౌన్, జూన్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** నిధులు రికవరీ చేయడంతో పాటు బాధ్యులైన అప్పటి డీఈపై, కీలక ప్రజాప్రతినిధిపై చర్యలు చేపట్టుట గురించి... పై విషయమును పురస్కరించుకొని తమరికి తెలియజేయునది ఏమనగా, కిసాన్ నగర్ లోని వ్యవసాయ మార్కెట్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో షెడ్ మరియు గద్దెలను తొలగించడం పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల అండతో అదనంగా రాక్ కటింగ్ పేరుతో రూ.85 లక్షలు బిల్లు రికార్డు చేసుకొని తీసుకున్నారు. ఈ విషయం బయటకు రావడంతో మేజర్మెంట్ బుక్ (ఎంబీ) మాయం చేసిన ఇంజనీరింగ్ అధికారులు రెండు సంవత్సరాల పాటు ఎంబీ దొరకకుండా మేనేజ్ చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం కూడా తమరికి తెలిసిందే. అప్పుడు ఈ అవినీతి భాగోతం మున్సిపల్ వ్యవస్థను కుదిపివేసింది. రాష్ట్ర రవాణా. బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్ కు నేను ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టాలని కలెక్టర్ ను, కమిషనర్ ను ఆదేశించారు. కానీ విచారణలో తీవ్ర జాప్యమైంది. మీరు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే విషయమై సీరియస్గా విచారణ చేపట్టి బాధ్యుడైన ఏఈని సస్పెండ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాం. కానీ మరింత లోతుగా విచారణ చేపట్టి బాధ్యుడైన అప్పటి డీఈపై కూడా చర్యలు చేపట్టాలని 44వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ అన్నారు, ఎంబీ విషయంలో కాంట్రాక్టర్ ను బ్లాకులిస్టులో పెట్టి. మరియు అవినీతికి ఆజ్యం పోసిన కీలక ప్రజాప్రతినిధి పాత్రపై కూడా విచారణ చేపట్టవలసిందిగా కోరుతున్నానని. అధికారులను, ప్రజాప్రతినిధులను మభ్యపెట్టి ప్రజాధనం రూ. 85 లక్షలు కాజేసిన కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు ప్రజల సొమ్మును రికవరీ చేయవలసిందిగా మనవి చేస్తున్నాను అని చెప్పారు.

## పరకాల సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి పట్టాభి రామారావు





**పరకాల, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామ రావు పరకాల సబ్ జైలు ను ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలందరిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికీ అందుతున్న వసతుల గురించి ఆరా తీశారు. ఖైదీలకు ప్రభుత్వ ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అనంతరం జైలు పరిసరాలను మొత్తం తిరిగి పరిశీలించి సంతృతి చెందారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాఅధికార సంస్థ చైర్మన్ క్షమా దేశపాండే, పరకాల సీనియర్ సివిల్ జడ్జి సాయి శరత్, పరకాల సబ్ జైలు సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి గారు మరియు డి.లీగల్ ఎయిడ్ కౌన్సిల్ యం. కవిత, స్థానిక లీగల్ ఎయిడ్ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్,డిగ్రీ కళాశాలల నూతన అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం

- తరగతి గదులు ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం, కార్పొరేటర్ మెట్టు
- సహకారం అందించిన గ్లాండ్ ఫార్మా కంపెనీ








**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ కళాశాలలో గ్లాండ్ ఫార్మా కంపెనీ CSR నిధులు 4 కోట్ల రూపాయలతో నిర్మించిన జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల అదనపు తరగతి గదులు, 3,4వ అంతస్తులను ఈ రోజు పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ కళాశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) నిధుల కింద 4కోట్ల రూపాయలతో నూతనంగా అదనపు తరగతి గదులతో 3వ అంతస్తులో 1కోటి 75లక్షలతో నిర్మించిన జూనియర్ కళాశాల అలాగే 4వ అంతస్తులో 2కోట్ల 25లక్షలతో నిర్మించిన డిగ్రీ కళాశాల గదులను ఈ రోజు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు ఇబ్బంది లేకుండా సౌకర్యవంతంగా ప్రభుత్వ కళాశాలలో చదువుకునే వెసులుబాటు ఉంటుందని అన్నారు. CSR నిధులు కేటాయించి అదనపు తరగతి గదుల నిర్మాణానికి సహకరించిన గ్లాండ్ ఫార్మా కంపెనీ వారిని కార్పొరేటర్ ఈ సందర్భంగా అభినందించారు.

## మతి స్థిమితం కోల్పోయిన కామన్పూర్ మాజీ జడ్పీటీసీ పుట్ట మధు

- లేతకరి రాజబాబు మండల కాంగ్రెస్ ఎస్సీ అధ్యక్షులు



**మహదేవపూర్ కాళేశ్వరం, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** అభివృద్ధి చూసి ఓర్వలేక పుట్టగతులు ఉండవని తెలిసి అక్కసుతో ఆరోపణలు చేస్తున్న పుట్ట మాజీ జడ్పీటీసీ సభ్యులు పుట్ట అపరిచితుడి అవతారం ఎత్తుకుంటున్నడు మంథని లో నిన్ను ఎవరు పట్టించు కోవడం లేదఅని లక్షల ఖర్చుపెట్టి హైద్రాబాద్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేస్తే కనీసం స్పందన కరువు అర్థం లేని ఆరోపణలు, మీడియా లో కనపడాలని తాపత్రయం తప్ప మాజీ జడ్పీటీసీ కి ఎలాంటి ఆలోచన లేదు ప్రభుత్వం ఏర్పాటు ఐన కొద్ది నెలల లోనే కోట్ల నిధులు తెచ్చి మంథని నియోజకవర్గన్నీ అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక ఆరోపణలు కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ రెండు పర్యాయాలు సిద్దిపేట వ్యక్తికి కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ పదవిని అమ్ముకొని మంథని బి ఆర్ ఎస్ కార్యకర్తలను, నాయకులను విస్మరించిన చరిత్ర మాజీ జడ్పీటీసీ పుట్ట మధు నామినేటెడ్ పదవుల గూర్చి మాట్లాడే ముందు బి ఆర్ ఎస్ నాయకులు పుట్ట మధును ఎందుకు కాళేశ్వరం దేవస్థానం పదవి మంథని కి చెందిన మా బి ఆర్ ఎస్ నాయకులకు ఎందుకు ఇవ్వలేదో పుట్ట మధు ను నిలదీయాలి మంథని నియోజకవర్గన్నీ సరస్వతి నిలయంగా మార్చిన చరిత్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుది మంథని లో శ్రీధర్ బాబు ఆనాడు మంత్రిగా ఉండి తన హయంలో మంథనికి తీసుకువచ్చిన,జే న్ టి యూ , ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంటర్, మెడల్ స్కూల్ లు, కస్తూర్బా స్కూల్ లు మంథని అంటే సరస్వతి నిలయం మాజీ జడ్పీటీసీ పుట్ట హయంలో దళిత హత్యలు, అడ్వకేట్ హత్యలు, ఇసుక దందాలు, ప్రాజెక్టు పై కమీషన్లు ఇది నీ హయంలో జరిగిన తంతు ఉనికి కోసం ఆరాటం, కమిషన్ల కోసం పోరాటం తప్ప మంథని అభివృద్ధి లో నీ పాత్ర గుండు సున్నా మంథని ప్రజలు నిన్ను నమ్మరు, గంజి తగిన అంబలి తగిన, మట్టిలో పుట్టిన అని దొంగ మాటలు ఒక్కసారి నమ్మరు, ఆ మాయమాటలు నమ్మే పరిస్థితి లో మంథని ప్రజలు లేరు మళ్ళీ నిన్ను నమ్మరు కాళేశ్వరం ప్రాజెక్టు లో కమీషన్లు తీసుకొని మంథని నియోజకవర్గ వనరులు కల్వకుంట్ల కుటుంబానికి దోచిపెట్టి ఇక్కడ ప్రజల నోట్లో మట్టి కొట్టి ఆ మట్టితో నీ రాజగృహం పునాదులు నిర్మించుకున్న చరిత్ర మాజీ జడ్పీటీసీ పుట్ట మధుది మంథని ప్రజలకు నీతో ఎలాంటి ఉపయోగం లేదు, ఇంకపై శ్రీధర్ బాబు పై ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెప్తారని లేతకరి రాజబాబు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ అధ్యక్షుడు అన్నారు ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు కొండగొర్ల సంతోష్ పాల్గొన్నారు

## విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు శంకరయ్య క్రీడాకారుల గుండెల్లో సజీవంగా బ్రతికే ఉంటాడు

- అంతర్జాతీయ క్రీడాకారులు ప్రభు



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ గత వారం రోజుల క్రితం మరణించగా సోమవారం జాతీయ , అంతర్జాతీయ క్రీడాకారులు ఘన నివాళులు అర్పించి, తన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ప్రభు , వై సరస్వతి మాట్లాడుతూ..రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కొండపాక శంకరయ్య ఉద్యోగరీత్యా సుమారు 35 సంవత్సరాల పాటు పని చేసి ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన నిరుపేద బిడ్డలను కుల, మతాలకతీతంగా గొప్పగా ఎదగాలని,ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయి ఎదిగే విధంగా శిక్షణ ఇస్తూ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపి మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆయన వ్యాయామ ఉపాధ్యాయుడే కాకుండా ప్రధానోపాధ్యాయులుగా వివిధ ప్రాంతాలలో విశేషమైన సేవలను అందించి ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులను క్రీడారంగంలో జాతీయ అంతర్జాతీయ పోటీలలో విజేతలుగా నిలిపిన ఘనత ఆయనదని పేర్కొన్నారు, చదువుతో పాటు, క్రమ శిక్షణ తో కూడిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారందరూ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలోకొండపాక కిషోర్ , వై సరస్వతి, వేల్పుల శేఖర్, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, మంద జగన్, భీష్మ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ గూడా,కిష్టారెడ్డిపేట్ పరిధిలో ఉన్న కాలనీల సమస్యలను పరిష్కరించండి

- మున్సిపల్ శాఖ వారిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్
- తాజా మాజీ పాలకుల విధ్వంసానికి కాలనీలన్నీ అస్తవ్యస్తం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** గతంలో అధికారంలో ఉండి ఇప్పుడు అధికారంలో ఉండి.ఏ పనులు చేయకుండా కాలనీవాసులు చేస్తున్న పనుల దగ్గర ఫోటోలు దిగి ఫోజులు ఇవ్వడం సిగ్గుచేటు. దయచేసి వెంటనే అన్ని కాలనీల సమస్యలను పరిష్కరించండి ప్రధాన సమస్యలు సీసీ రోడ్ల నిర్మాణం,డ్రైనేజీ వ్యవస్థ సరిచేయడం,ఎలక్ట్రిసిటీ సమస్యలు,లో వోల్టేజ్ సమస్య పరిష్కారం,వీధి దీపాల పునరుద్ధరణ,ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు,విద్యుత్ స్తంభాల ఏర్పాటు,కాలనీలలో శానిటేషన్ మెరుగుదలఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ శాఖ అధికారులను కోరారు. కాలనీ వాసుల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యం అని ఐలాపూర్ మాణిక్ యాదవ్ స్పష్టం చేశారు.

## గురుకులాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి

TGPA



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనవరి నుండి భోజన కాంట్రాక్టర్లకు చెల్లించని బకాయిలు నిలిచిపోయిన గుడ్లు, చికెన్,అరటి పండ్ల సరఫరా.రేవంత్ రెడ్డి అసమర్థ పాలనలో అద్వానంగా గురుకుల పాఠశాలల పరిస్థితి. 13 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో పాఠశాల ప్రారంభం రోజున భవనాలకు తాళం వేసిన యజమానులు దీంతో 3 నెలల అద్దె చెల్లించి చేతులు దులుపుకున్న ప్రభుత్వం. ఈ సందర్భంగా తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబాల కిరణ్ కుమార్ మాట్లాడుతూ అనేక గురుకులాల్లో జనవరి నుండి భోజన బకాయిలు. చెల్లించకపోవడంతో మెనులోని కీలక ఆహార పదార్థాల సరఫరా నిలిపివేసిన కాంట్రాక్టర్లు ఏం చేయాలో తెలియక అయోమయంలో పడ్డ రాష్ట్ర అధికారులుప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించకపోతే, జులై 1వ తేదీ నుండి అన్ని రకాల ఆహార పదార్థాల సరఫరా నిలిపివేస్తామని హెచ్చరిస్తున్న కాంట్రాక్టర్లు. చిలుకూరు ఎస్సీ గురుకుల పాఠశాలకు రూ.10 లక్షల భోజన బకాయిలు చెల్లించకపోవడంతో గుడ్లు, మాంసం సరఫరా నిలిపివేసిన కాంట్రాక్టర్ఇప్పటికే భార్య నగలు తాకట్టు పెట్టానని, ప్రభుత్వం బిల్లులు చెల్లించేవరకు ఆహార సరఫరా చేయలేనని తేల్చి చెప్పిన కాంట్రాక్టర్ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో యూనిఫామ్స్ అందించకపోవడంతో, గత సంవత్సరం ఇచ్చిన యూనిఫామ్స్ తోనే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులుపేద విద్యార్థులు చదువుకునే గురుకులాల పట్ల రేవంత్ రెడ్డి నిర్లక్ష్య ధోరణి సరికాదని అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు అని ఆయన అన్నారు.

## పరకాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి...

- ఏకు శంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేసి దోషులను చట్టపరంగా శిక్షించాలి
- ఎమ్మార్పీఎస్.ఎస్ఎఫ్ఐ మరియు వివిధ విద్యార్థి సంఘాల ప్రజా సంఘాల,ఆధ్వర్యంలో పరకాల గురుకుల పాఠశాల ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా



**పరకాల,జూన్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటున్న ఏకు శ్రీవాణి పరకాల స్థానిక విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం పాఠశాల సిబ్బంది పర్యవేక్షణ పై ధర్నా నిర్వహించడం జరిగింది సందర్భంగా ఏకు శంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ పరకాల గురుకుల పాఠశాలలోని విద్యార్థిని అనుమానస్పదంగా ఉదయం ఆత్మహత్య చేసుకోవడం పాఠశాల సిబ్బంది యొక్క తీరుపై వారు చెబుతున్న సమాధానాలపై అనేక అనుమానాలకు దారి తీసింది అని అమ్మాయి చనిపోయిందని విషయం కనీసం తోటి విద్యార్థులు కూడా తెలియకుండా చేయడం బాధాకరమని వాపోయారు విద్యార్థుల పట్ల ప్రిన్సిపల్ మరియు పాఠశాల సిబ్బంది ప్రతి ఒక్కరిని బాధ్యులను చేస్తూవెంటనే ఎలాంటి రాజకీయ ప్రభావం లేకుండా ఈ ఘటనపై పూర్తిగా ఎంక్వయిరీ నిర్వహించి బాధ్యులను శిక్షించాలని అలాగే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు మరియుతెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలో కనీసం పర్యవేక్షణ కరువైంది గురుకులాల సెక్రెటరీ వెంటనే తొలగించాలి గతంలో ఎస్సీ ఎస్టీ గురుకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన గురుకులాల చదువుతున్న దళిత విద్యా ర్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సెక్రెటరీ అలుగు వర్షినిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# కలవరపెడుతున్న వర్షాభావ పరిస్థితులు

- **నదుల అనుసంధానంపై కానరాని చిత్తశుద్ధి**
- **పర్యావరణ పరిరక్షణలో పాలకుల నిర్లక్ష్యం**

**న్యూఢిల్లీ,జూన్30:** వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృధాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయటపడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధా నించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. దేశ జనాభా పెరుగుతున్న క్రమంలో మన వ్యవసాయాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఆలోచనలు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపని గా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా



దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారు తున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చ లేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరిం చడానికి చిత్తశు ద్ధితో ఆలోచించడం లేదు.

---

# ఉమ్మడి పౌరస్మృతిపై కానరాని కదలిక



- **ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చిస్తారా..?**
- **మరోమారు ప్రజల్లో మొదలైన చర్చ**

**న్యూఢిల్లీ,జూన్30:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి బిల్లును తీసుకుని రాగలదా అన్నచర్చ సాగుతోంది. దీనిపై ఏకాభిప్రాయం మాత్రం రాదని విపక్షాల తీరును బట్టి తెలుస్తోంది. విపక్షాలు కూడా ఈ విషయంలో తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. అనంతరం దీనిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించడం ద్వారా ముందుకు తీసుకుని రావాన్న ప్రయత్నాలు సాగడం లేదు. ఇప్పటికే దీనిపై అనేక రాజకీయ పక్షాలు విమర్శల దాడిని పెంచాయి. అయితే గత సార్వత్రిక ఎన్నికలకు ముందే దీనిని తీసుకుని వస్తారని అనుకున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలైలో ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈ సమావేశాల్లోనే పార్లమెంటుకు సమర్పించి, అనంతరం దానిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించే అవకాశం ఉందని అంటున్నారు. సిబ్బంది, ప్రజా సమస్యలు, న్యాయ వ్యవస్థకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం షెడ్యూలు ప్రకారం, లా కమిషన్, లీగల్ అ్గ÷ర్స్, న్యాయ మంత్రిత్వ శాఖలలోని లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్స్ ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరిస్తుంది. దేశంలోని అన్ని వర్గాలవారికి, ప్రతి ఒక్కరికీ ఒకే చట్టం అమలు కావాలని గతంలో మోడీ పదేపదే చెప్పారు. ఈ సున్నితమైన అంశంపై ముస్లింలను కొందరు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. యూసీసీని తీసుకురావాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న వారు మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఒక దేశం రెండు రకాల వ్యవస్థలను ఎలా అమలు చేయగలదని ప్రశ్నించారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల్లో యూసీసీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. భారత రాజ్యాంగంలోని అధికరణ 44 కూడా ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలని చెప్తోంది. మోదీ వ్యాఖ్యలతో గత రెండుమూడేళ్లుగా యూసీసీపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మణిపూర్ హింసాకాండ వంటి సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోదీ యూసీసీ అంశాన్ని లేవనెత్తుతున్నారని దుయ్యబడుతున్నాయి. ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వస్తే వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి అంశాల్లో దేశంలోని ప్రజలందరికీ ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులకు వేర్వేరు వ్యక్తిగత చట్టాలు అమలవుతున్నాయి. హిందూ చట్టాల ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిలో వారసత్వ హక్కులు పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఉన్నాయి. క్రైస్తవులకు వర్తించే చట్టం ప్రకారం క్రైస్తవ మహిళలకు ముందుగా నిర్ణయించిన వాటా మాత్రమే లభిస్తుంది. పిల్లలు, ఇతర బంధువులు ఉండటాన్ని బట్టి ఈ వాటా ఉంటుంది. పారశీక మతానికి చెందిన మహిళ తన భర్త మరణించినట్లయితే, తన పిల్లలతో సమాన వాటాను పొందవచ్చు. ముస్లిం మహిళలకు తమ తండ్రి ఆస్తిలో పురుషులకు లభించే వాటాలో సగం లభిస్తుంది. అంతేకుండా చట్టాలు సమానంగా ఉంటాయి. అయితే దీనిని తీసుకుని రావడం ఎంతవరకు విజయం సాధిస్తుందన్నదే ప్రశ్న.

# వైద్యో నారాయణో హరిః







- **నేడు జాతీయ వైద్యుల దినోత్సవం**

**న్యూఢిల్లీ,జూన్30:** వైద్యో నారాయణో హరిః అన్నది ఆర్యోక్తి. వైద్యుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడితో సమానం. ఎందుకంటే ప్రాణాపాయం నుంచి మనలను గట్టెక్కించేది అతడే గనుక. మనం భూమి మీద రావడానికి ముందే డాక్టర్ సహాయం అవసరమ వుతుంది. మనం పుట్టి, పెరిగి పెద్దయ్యాక కూడా వైద్యుని సహకారం ఖచ్చితంగా ఉంటుంది. అందుకే వైద్యోనారాయణ హరి అని అంటుంటారు పెద్దలు.. మనకు ఏ చిన్న రోగమొచ్చినా దాన్ని చిటికెలో నయం చేసే ఆపద్బాంధవుడు వైద్యుడే. మనలో ఎవరికైనా ప్రాణాపాయం కలిగినప్పుడు మన ప్రాణాల్ని కాపాడేం దుకు శాయశక్తులా కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తారు. అంతేకాదు మనలోని మానసిక స్థితిని బట్టి, మన ప్రవర్తనకు తగ్గట్టు వ్యవహరిస్తారు. మనకు ఎలాంటి బాధ కలగకుండా మనకు చికిత్స చేసేందుకు ప్రయత్నం చేస్తారు. మనం వ్యాధి నుండి త్వరగా కోలుకునేలా చేస్తారు. ఒకవేళ మనం వ్యాధి నుండి బయటపడలేని స్థితిలో ఉంటే, మిగిలిన జీవితాన్ని హాయిగా గడిపేందుకు వారి వంతు ప్రయత్నం చేస్తారు. ఇంతటి గొప్ప యోధులని గుర్తు చేసుకునేందుకే డాక్టర్స్ డే జరుపుకుంటారు. అయితే ఈ వైద్య దినోత్సవాన్ని డాక్టర్ బిధన్ చంద్ర రాయ్ జయంతి రోజునే జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ బిధన్ చంద్ర రాయ్‌ను స్మరించు కునేందుకు జులై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవాలని, 1991 సంవత్సరంలో కేంద్రం నిర్ణయించింది. ఆయన ఒక గొప్ప వైద్యుడు, విద్యావేత్త, స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. శాసన ఉల్లంఘన ఉద్యమంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. డాక్టర్ బిదన్ చంద్ర రాయ్, పశ్చిమ బెంగాల్‌కు రెండో ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. వైద్య రంగంలో ఎన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. తన జీవితాన్ని వైద్యరంగానికి అంకితమిచ్చారు. జులై ఒకటో తేదీన ఆయన జన్మించారు.. అయితే అదే రోజున ఆయన మరణించడం విశేషం. అందుకే మనదేశంలో ఆయన జ్ఞాపకార్థం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆయన వైద్య రంగంలోనే కాదు, రాజకీయాల్లో చాలా కీలక పాత్ర పోషించారు. 1947 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా కూడా పని చేశారు. 1948 సంవత్సరంలో జనవరి 23వ తేదీన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. సామాన్య ప్రజలకు సైతం వైద్యం అందుబాటులో ఉండేందుకు ఆయన ఎంతగానో కృషి చేశా రు. కలకత్తాలో అనేక మెడికల్ కళాశాల లను ఏర్పాటు చేశారు. అంతేకాదు తను కలకత్తా కార్పొరేషన్ మేయర్ గా ఉన్న సమయ ంలో ఉచిత విద్య, ఉచిత వైద్య సేవలు, మంచి రోడ్లు, విద్యుత్ దీపాలు, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూశారు. బెంగాల్ సిఎం అయ్యాక లా అండ్ ఆర్డర్ పై కూడా పూర్తిగా పట్టు సాధిం చారు. 1961లో తన ఇంటిని కూడా పేద ప్రజల కోసం విరాళం గా ఇచ్చేశారు. అదే ఏడాది అంటే 1961 ఫిబ్రవరి 4వ తేదీన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును ప్రకటించింది.

# మరో ఇంట్రెస్టింగ్ మూవీతో వస్తున్న అల్లరి నరేశ్.. ఆసక్తికరంగా ఫస్ట్ లుక్




ఒకప్పుడు తన కామెడీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన నటుడు అల్లరి నరేశ్ ఇప్పుడు విభిన్నమైన కథలను ఎంచుకుంటూ నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నారు. ఈ రోజు తన పుట్టినరోజు సందర్భంగా ఆయన తన 63వ చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను అభిమానులతో పంచుకున్నారు. మెహర్ తేజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.ఆసక్తికరంగా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇందులో అల్లరి నరేశ్ పూర్తిగా మద్యానికి బానిసైన వ్యక్తిగా, గందరగోళంలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. తనదైన నటనతో కామెడీనే కాకుండా భావోద్వేగాలను కూడా అద్భుతంగా పండించగల నరేశ్.. ఈ చిత్రంలో మరో శక్తివంతమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారని స్పష్టమవుతోంది.ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేశ్‌కు జోడీగా నటి రుహాని శర్మ నటిస్తుండగా, విలక్షణ సంగీత దర్శకుడు గిబ్రాన్ స్వరాలు సమకూరుస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమా, నరేశ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# 'కే-ర్యాంప్' ఫస్ట్ లుక్

## : ఊర మాస్ లుక్‌లో కిరణ్ అబ్బవరం



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వరుస హిట్స్‌తో టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. ఇటీవలే 'క' అనే సినిమా ద్వారా బ్లాక్‌బస్టర్ అందుకున్న కిరణ్.. ఇప్పుడు మరో యూనిక్ టైటిల్‌తో తెరకెక్కుతున్న 'కే-ర్యాంప్' సినిమాతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి రెడీ అవుతున్నాడు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్‌లో కిరణ్ అబ్బవరం మాస్ గెటప్‌లో చొక్కా, లుంగీ ధరించి చిరునవ్వుతో స్టైల్‌గా ముందుకు నడుస్తూ కనిపిస్తున్నారు. వెనుకవైపు ఫైర్ ఎఫెక్ట్‌లతో తయారైన హార్ట్ షేప్ బాటిల్స్ డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పోస్టర్ మొత్తం స్టైల్, ఫన్, ఫైర్ మూడూ కలగలిపినట్టుగా ఉండి సినిమా టోన్‌పై ఆసక్తిని పెంచింది. ఫస్ట్ లుక్‌తోనే అభిమానుల అంచనాలు మరింత పెరిగిపోయాయి. ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఆయన తొలి చిత్రం కాగా.. కథ, స్క్రీన్‌ప్లే కూడా ఆయనే అందిస్తున్నారు. కిరణ్‌కు జోడిగా యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాలో కూడా కిరణ్ న్యూ ఎనర్జీతో, మాస్ డైలాగ్ డెలివరీతో అభిమానులను ఆకట్టుకునేలా ఉన్నాడు. కే-ర్యాంప్ టైటిల్‌ను పోస్టర్ డిజైన్‌లో కూడా స్టైలిష్‌గా ప్రెజెంట్ చేయడం విశేషం. ఈ సినిమాను హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులోయిడ్స్ బ్యానర్లపై రాజేశ్ దండ, శివ బొమ్మక్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. కిరణ్ అబ్బవరం, చేతన్ కాంబినేషన్‌లో ఇది మూడో సినిమా కావడం విశేషం.



# ఎన్టీఆర్ సినిమా కోసం అమ్మడి డిమాండ్..!

సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయిన రుక్మిణి వసంత్ ఇప్పుడు టాలీవుడ్ లో ఫేవరెట్ హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకుంది. మామూలుగానే కన్నడ నుంచి వచ్చిన భామలకు మంచి డిమాండ్ ఉంటుంది. సో సప్త సాగరాలు దాటి సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించిన రుక్మిణి ఇక్కడ వరుస ఛాన్స్ లు అందుకుంటుంది. ఆల్రెడీ నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసిన రుక్మిణి ఆ సినిమాతో అంత ఇంపాక్ట్ చూపలేకపోయింది. ఆ సినిమా కూడా ఎప్పుడో తీశారన్నట్టుగానే వచ్చింది. ఇక ఇదిలా ఉంటే ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబో ప్రాజెక్ట్ లో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. ఈమధ్యనే అమ్మడు షూటింగ్ లో పాల్గొన్నదని తెలుస్తుంది. ఎన్టీఆర్ తో ఛాన్స్ అంటే రుక్మిణికి టాలీవుడ్ లో స్టార్ స్టేటస్ వచ్చినట్టే లెక్క. ఐతే ఈ సినిమాలో నటించేందుకు గాను అమ్మడు భారీగానే రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది. కన్నడ సినిమాల్లో హీరోయిన్స్ కి అంత ఎక్కువ పారితోషికం ఉండదు. అక్కడ స్టార్ హీరోయిన్స్ కే కోటి కన్నా ఎక్కువ ఇవ్వరు. రుక్మిణి వసంత్ అయితే ఇప్పటివరకు మేకర్స్ ఇచ్చిన పారితోషికం తీసుకోవడమే కానీ తను డిమాండ్ చేసింది లేదు. ఐతే ఎన్టీఆర్ సినిమాకు మాత్రం అమ్మడు కోటిన్నర దాకా రెమ్యునరేషన్ డిమాండ్ చేసిందని టాక్. తెలుగు హీరోయిన్స్ అది కూడా కాస్త ఫాం లో ఉన్న హీరోయిన్స్ కి కోటిన్నర ఏంటి 2 కోట్ల నుంచి 3 కోట్లు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఐతే ఈమధ్య స్టార్ హీరోలంతా భారీగా రెమ్యూనరేషన్ పెంచారు కాబట్టి హీరోయిన్స్ కూడా అందుకు తగినట్టుగానే డిమాండ్ చేయాలని ఫిక్స్ అయ్యారు.



# 'కన్నప్ప'పై పైరసీ పంజా..

ప్రతిష్ఠాత్మకంగా, పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకున్న 'కన్నప్ప' చిత్రంపై పైరసీ భూతం పంజా విసిరింది. ఈ చిత్రానికి సంబంధించిన వేలాది పైరసీ లింకులు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంపై 'కన్నప్ప' చిత్ర బృందం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు హీరో మంచు విష్ణు హార్ట్ బ్రేకింగ్ అంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఇప్పటివరకు 30,000కు పైగా పైరసీ లింకులను గుర్తించి తొలగించినట్లు వెల్లడించారు.

"మా 'కన్నప్ప' సినిమా పైరసీకి గురవుతోంది. ఇది చాలా బాధాకరం. ఇప్పటికే 30,000 పైచిలుకు పైరసీ లింకులను తొలగించాం. పైరసీ అనేది ముమ్మాటికీ దొంగతనమే. మనం మన పిల్లలకు దొంగతనం చేయమని నేర్పించం కదా? పైరసీ కంటెంట్ చూడటం కూడా అలాంటిదే. దయచేసి దీనిని ప్రోత్సహించకండి. సరైన మార్గంలో సినిమాకు మద్దతు ఇవ్వండి" అని విష్ణు విజ్ఞప్తి చేశారు.

ఎంతో శ్రమ, పెట్టుబడితో నిర్మించే సినిమాలను పైరసీ రూపంలో దెబ్బతీయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. సినిమా పరిశ్రమను తీవ్రంగా నష్టపరిచే పైరసీని అరికట్టేందుకు ప్రేక్షకుల సహకారం ఎంతో అవసరమని విష్ణు అభిప్రాయపడ్డారు. సినిమాను థియేటర్లలో లేదా అధికారిక ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో మాత్రమే చూసి, తమ కష్టానికి ప్రతిఫలం అందించాలని కోరారు.



# క్రేజీ మూవీకి సీక్వెల్

'ఈ నగరానికి ఏమైంది' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులని, ముఖ్యంగా యువతను ఆకట్టుకుని సంచలన విజయం సాధించి కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. సినిమా రీరిలిజ్ మరింత ఆసక్తిని కలిగించింది. ఇప్పుడు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సీక్వెల్ ను అధికారికంగా ప్రకటించారు. 'ఈఎన్ఈ రిపీట్ 'టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మళ్ళీ అదరగొట్టబోతోందనే హామీ ఇస్తోంది. దాదాపు ఒరిజినల్ స్టార్ కాస్ట్, టెక్నికల్ టీంతో తిరిగి వస్తోంది ఈ సీక్వెల్. ఫస్ట్ పార్ట్‌లో అందరినీ అలరించిన గ్యాంగ్ విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను మరోసారి అలరించబోతున్నారు. తరుణ్ భాస్కర్ ఈ సీక్వెల్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ ఒరిజినల్స్, సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై డి. సురేష్ బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మిస్తున్నారు.

# గురూజీ కాంపౌండ్ లో రానా!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో భారీ మైథలాజికల్ థ్రిల్లర్ చిత్రం లాక్ అయినట్లు ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. బన్నీ చేయాల్సిన స్క్రిప్ట్ తిరిగి తిరిగి తారక్ వద్దకు చేరినట్లు వినిపిస్తుంది. బన్నీ అట్లీకి లాక్ అయిన తర్వాత ఇదే స్టోరీ రామ్ చరణ్ వద్దకు వెళ్లిందని ప్రచా రంలోకి వచ్చింది. అక్కడ నుంచి తారక్ వద్దకు వెళ్లినట్లు జోరుగా వినిపిస్తుంది. తారక్ కూడా లాక్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. అభిషేక్ ఈ నేపథ్యంలో తాజాగా మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. ఈ కథలో దగ్గుబాటా రానా ఎంటర్ అవుతు న్నాడుట. ఇందులో ప్రతి నాయకుడి పాత్రకు గురూజీ రానాని తీసుకుంటున్నట్లు కొత్త వార్త వినిపిస్తుంది. ఈ పాత్ర ఒక స్వామిజీ తరహాలో ఉంటుందని... ప్రధాన ప్రతి నాయకుడి పాత్రగా వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతో తెలియాలి. ఇదే నిజమైతే రానాకిది మంచి అవకాశమే. %-%వెట్టేయాన్%-% తర్వాత రానా వెండి తెరపై కనిపించలేదు. అందులో విలన్ పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మళ్లి ఇంత వరకూ మరో సినిమా చేయ లేదు. హీరోగానూ కనిపించలేదు. విలన్ గానూ కనిపిం చలేదు. మధ్యలో నిర్మాతగా మాత్రమే బిజీగా ఉన్నా డు. హిరణ్యకశిష ప్రాజెక్ట్ అనుకున్నా? అది కార్యరూపం దాల్చలేదు. ఇలా కొంత కాలంగా రానా బండి లాగుతున్నాడు. తాజాగా గురూజీ రూపంలో మరో అవకాశం దక్కినట్లు అయింది. విలన్ పాత్రలు రానాకి కొత్తేం కాదు. %-%బాహుబలి%-%తో పాన్ ఇండియాలోనే విలన్ గా ఫేమస్ అయ్యాడు. భల్లాల దేవ పాత్రతో తన కంటూ ఓ ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నాడు. మళ్లీ అంతటి బలమైన పాత్రలు రాలేదు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ ఆ రేంజ్ రోల్ ఇస్తున్నట్లే కనిపిస్తుంది.